నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# ఆదిలాబాద్

శుక్రవారం 24 నవంబర్ 2023
FRIDAY, NOVEMBER 24, 2023 | ADILABAD | పేజీలు PAGES : 8





బహిరంగ సభ వేదిక

# కార్మిక క్షేత్రానికి గులాబీ బాస్

**నేడు మంచిర్యాలలో సీఎం కేసీఆర్ 'ప్రజా ఆశీర్వాద సభ'**

- అభ్యర్థి దివాకర్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ పర్యటన
- భారీ ఏర్పాట్లు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు

..8లో

**గులాబీ దళపతి, ముఖ్యమంత్రి** కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కార్మిక క్షేత్రమైన మంచిర్యాల జిల్లాలో పర్యటించనున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు విజయాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే 'ప్రజా ఆశీర్వాద సభ'లో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తారు. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో సభలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని నేడు(శుక్రవారం) బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపడానికి వస్తున్నారు. మంచిర్యాల కలెక్టరేట్ పరిధిలో బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. ఎప్పటికప్పుడు సభా వేదిక పనులను అభ్యర్థితోపాటు ఎంపీ వెంకటేశ్ నేతకాని, నియోజకవర్గ ఇన్‌చార్జి, ప్రభుత్వ విప్ భాను ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. సభకు 50 వేలకుపైగా మందిని తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందించారు. సీఎం రాక సందర్భంగా సభా ప్రాంగణం పరిధి గులాబీ మయమైంది. వీధులు, కూడళ్ల వద్ద భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. *- మంచిర్యాల, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

# అందరి చూపు.. బీఆర్ఎస్ వైపు..

- ఆదిలాబాద్ నియోజకవర్గంలో భారీగా చేరికలు
- ఒకే రోజు 5 వేల మంది..

**ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన** తర్వాత సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై ఆదిలాబాద్ నియోజకవర్గంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. రెండు నెలల వ్యవధిలో దాదాపు 25 వేల మంది గులాబీ పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. తాజాగా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఒకేరోజు 5 వేల మంది చేరారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులకు ఎమ్మెల్యే జోగు రామన్న గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రెండు నెలల్లో 11 వేల మంది యువత, 9 వేల మంది మహిళలు, మిగతా ఇతరులు బీఆర్ఎస్‌లో చేరినట్లు నాయకుల తెలిపారు. *- ఆదిలాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ)*



బీజేపీ నాయకుడు సంతోష్‌కు గులాబీ కండువ కప్పి బీఆర్ఎస్‌లో ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న



## మధ్యవర్తులతో పనిలేదు..

నేరడిగొండ, నవంబర్ 23: ధరణి రాక మునుపు రెవెన్యూ ఆఫీసుల్లో పట్టా చేస్తే మధ్యవర్తులకు ఎంతో కొంత ముట్ట జెప్పాల్సి వచ్చేది. పట్టా కోసం రోజుల తరబడి ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. తెలంగాణ ప్రభుత్వం ధరణి తీసుకువచ్చిన నుంచి తిప్పలు తప్పినయ్. ఇంతకు ముందులా ఎవరికీ డబ్బులు ఇయ్యకుండా పని చేస్తున్నరు. నాకు ఎనిమిదెకరాల భూమి ఉంది. నేను మా బంధువు భూమి కొంటే పోయిన. ఒక్క రూపాయి ఖర్చులేకుండా పట్టా చేసింద్రు. ధరణితో అన్ని విధాలలో కరెక్టుగా ఉన్న భూములు అమ్మడం, కొనడంలో ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ఈ సర్కారు తీసుకొచ్చిన ధరణి చాలా మంచిగ ఉన్నది. ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తమంటున్నరట. అది కరెక్టు కాదు. ధరణి తప్పకుండా ఉండాలె. ధరణి ఉంటనే మధ్యవర్తులతోని పని ఉండది. ఇగ కాంగ్రెసోళ్లు వస్తే మళ్లీ మధ్యవర్తులే రాజులైతరు. అందుకే రైతులు మంచిగ ఆలోచించి ఓటెయ్యాలె. *-తొడసం మారుతి, లక్ష్మీపూర్*

# ధరణి ఎత్తేస్తే పైరవీకారులదే రాజ్యం

.. మధ్యపేజీలో

**పైసలు ముట్టజెప్పనిదే ఫైలు ముందుకు కదలదు..**

- పటేల్, పట్వారీ వ్యవస్థలు మళ్లీ పుట్టుకొస్తయ్..
- పట్టా కావాలంటే డబ్బులు ముట్టజెప్పాల్సిందే..
- మళ్లీ పాత పద్ధతిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ కుట్ర

**ధరణిని ఎత్తేస్తే ఏమైతదది..** దళారులు, పైరవీకారుల రాజ్యం పుట్టుకొస్తది. పైసలు ముట్టజెప్పందే ఫైలు ముందుకు కదలదు. ఏండ్లకేండ్లు, దుమ్ము పట్టినా సరే ఆ దస్త్రాన్ని పట్టించుకునే నాథుడు ఉండడు. ఇంకా.. భూ రికార్డులు మారుతయ్. రాత పద్ధతి ఉంటుంది కాబట్టి భూ యజమానులకు తెలియకుండా ఒకరి భూమి మరొకరి పేరిట మార్చుకోవచ్చు. భూదందాలు, సెటిల్మెంట్లకు తెరలేసి గొడవలు, ఘర్షణలకు అవకాశం ఏర్పడుతుంది. పచ్చని పైరుతో కళకళలాడాల్సిన పల్లెలు రక్తంతో తడిసి ముద్దయ్యే చాన్స్ ఉంది. రైతుబీమా, రైతుబంధును పైరవీకారులు, దళారులు లంచాలు ఇవ్వనిదే అమలు చేయారు. ఎన్నారైల భూములకు కూడా రక్షణ లేకుండా పోతుంది. దీంతో కబ్జాకోరులు పుట్టుకొస్తరు. ఫలితంగా సన్న, చిన్నకారుల జీవితాలు బుగ్గిపాలవుతాయి. మొత్తానికి అన్నదాతలు తమ ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉంది. *- ఆదిలాబాద్, నవంబర్ 23(నమస్తే తెలంగాణ)*

# మూడు గంటలతో ముప్పుతిప్పలే

**కాంగ్రెస్ పాలనలో ప్రత్యక్ష నరకం చూపిన్రు**

- కరెంట్ కోసం వేడుకున్నా కనికరించలే
- 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేం
- సీఎం కేసీఆర్ వల్లే పండుగలా వ్యవసాయం
- 24 గంటల ఉచిత విద్యుత్‌తో రంది లేకుంట పంటలు

"**కాంగ్రెస్ పాలనంటేనే దరిద్రం.** కరెంట్.. నీళ్లు లేక నరకం అనుభవించినం. పంట కాపాడుకునేందుకు రాత్రీ పగలూ పొలాల పొంటే తిరిగేటోళ్లం. మస్తు మంది పురుగూ..బూసి కుట్టి చనిపోయిన్రు. గసొంటి కష్టాలు మళ్లా రాకూడదు. అప్పటి రోజులు తల్సుకుంటనే భయమైతంది. గిప్పుడు ఎలక్షన్లు వచ్చినయని మళ్లొస్తన్రు. 3 గంటల కరెంటిస్తమంటున్నరు. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. తెలిసీ.. తెలియక ఏదేదో మాట్లాడుతున్రు. మళ్లా ముప్పుతిప్పలు పెట్టేందుకు తయారైతన్రు." అంటూ రైతులు మండిపడుతున్నారు. 'హస్తం'ను నమ్మి కష్టాలు కొనితెచ్చుకోలేమని, తర్వాత గోస పడుడేనని చెబుతున్నరు. సీఎం కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంట్‌తో రంది లేకుంట ఎవుసం చేసుకుంటున్నామని, మా క్షేమం కోరే బీఆర్ఎస్‌నే మరోసారి గెలిపించుకుంటామని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. *- ఆదిలాబాద్, నవంబర్ 23 ( నమస్తే తెలంగాణ)*

## ఉన్న పైపులు.. మోటర్లు తీసేయాలా?



బోథ్ అభ్యర్థి అనిల్ జాదవ్‌తో రైతు సురేశ్

కాంగ్రెసోళ్లు పాలించినన్ని రోజులు అరిగోస పెట్టిన్రు. కరెంటియ్యక.. నీళ్లియ్యక నరకం చూపెట్టిన్రు. గా రోజులనింక మరిచిపోలేదు. ఇప్పుడు ఎన్నికలొచ్చినయని అదిస్తం.. ఇదిస్తం అని మాయమాటలు చెబుతున్రు. గాళ్లను నమ్మే రోజులు ఎప్పుడో పోయినయ్. ఎవుసానికి మూడు గంటల కరెంట్ సరిపోతదని చెబుతున్రు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. గిన్నేండ్ల సంది ఎవుసం చేస్తున్నం. రేవంత్‌రెడ్డి చెప్పిండని ఉన్న పైపులు.. మోటర్లు.. తీసేసి కొత్తవి తెచ్చుకోవాలా. రైతులకు డబ్బులెవ్వడిస్తడు. కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు పట్టుకుంటే బతుకులు ఆగమైతయ్. నాకు ఎనిమిదెకరాల భూమి ఉంది. పత్తి, మిర్చి పంట వేసిన. మా మేలు కోరుతున్న బీఆర్ఎస్ సర్కారు వెంటే ఉంటం. *- మర్రి సురేశ్, రైతు, అనంతపూర్, బజార్‌హత్నూర్, మండలం*